# ముగ్గురు మనుష్యులూ, ఒక కత్తీ

[ కథ ]

☼

## — జాన్ నిట్టెల్ —

[ గతసంచిక తరువాయి ]

నేను తిరిగి బడాహాకీముగదికి వెళ్లాను. అక్కడ బాబా చేతులతో ముఖం కప్పుకొని, మోచేతులు బల్లమీద ఆనించి కుర్చీలో కూర్చొని ఉన్నాడు. చూస్తే అతడేదో పెద్దవిచారంలో మునిగిఉన్నట్టు తోచింది. కాని, నాఅలికిడి చెవినిబడగానే వైఖరి పూర్తిగా మార్చివేశాడు.

"క్షమించాలి. ఇవాళ నీతో ఫలహారానికి రాగల స్థితిలో లేను. బోలెడంతపని ఉన్నది. ఇదిగో ఈ వ్యవహారం..."అని సగంమాటలోనే ఆపి పైకిలేచాడు. "నేను పోలీసుస్టేషనుకు వెళ్లుతున్నా"నన్నాడు.

"నేనూ రానా, నీతోపాటు ?" అన్నాను.

"రా, రా. అయినా, పత్రికా రిపోర్టరును మించి పోయేట్టున్నావులే నీవు !"

మేము పోలీసుస్టేషను చేరుకొన్నాము. మామూరు కాఫీ సిగరెట్లతో మాకు ఆతిథ్యమిచ్చాడు. తరువాత వాలుకుర్చీల్లో చాలాసేపు సంభాషణలు జరిగినాయి. చిట్టచివరకు జస్సీనును చూడడానికి బాబాకు అనుమతిలభించింది. బందీఖానాదగ్గరకు ఆయనతోపాటు నేనూ వెళ్లాను. ఒక పోలీసుఉద్యోగివచ్చి హంతకుడు ఉన్న గదితలుపులు తెరిచాడు.

బాబా ఒంటరిగానే లోనికివెళ్లాడు. బయటనే నుంచొని చూస్తున్న నాకు ఒక చీకటికోణంనుంచి పైకి లేస్తున్న ఒక నీడ జాడ కనబడింది. సరళస్నిగ్ధ ముఖంతోనూ, నిగనిగలాడే పల్వరుసతోనూ ఒప్పారుతున్న ఒక యువకుడు ముందుకువస్తున్న వైనం ఆతరువాత నాకు గోచరమయింది. "ఎందుకోయ్, నీవిలాటి పనిచేశావు ?"అని బాబా అడిగిన మూడుముక్కలు కూడా నాకు విన్పించాయి. తోడ్తోనే యువకునికండ్ల వెంట జలజల నీళ్లురాలజొచ్చాయి. వెంట్రుకలంతా చింపిరిచింపిరిగా కెలుకుకొన్నాడు. తదుపరి సంతత వాగ్ధారకు అందుకొన్నాడు.

ఉద్యోగి నావైపుతిరిగి, చెవిలో మెల్లన ఇలా వినిపించాడు : "వాడు వట్టి అబద్ధాలకోరు. నెలరోజుల క్రితమే వాడు అబ్దుల్‌ను చంపుతానని బెదిరించినట్టుగా ఋజువుచేయగల సాక్షులు ఆరుగురు మాకు సిద్ధంగా చిక్కిఉన్నారు. సంగతి ఇలాఉంటే, వాడేమో, అబ్దుల్ కత్తిపట్టుకొని తనను చంపడానికి వచ్చినట్టూ, తాను ఆత్మరక్షణకోసమని అతనిని పొడిచినట్టూ చెప్పజూస్తున్నాడు. అలానే అయితే, నేరం చేసిన వెనువెంటనే తానెందుకు ఉడాయింపబోవడం ? నిజంగా ఇది అసలు హత్య ! శుద్ధహత్య !! పోతాడులే ఉరితాట చిక్కుకొని!!!"

"మొదట జరగవలసిన విచారణంతా జరిగితీరుతుందనుకొంటాను—అవునా ?" అన్నాను.

"తప్పకుండాను. ఇక్కడ ఈజిప్టులో మేము ఫ్రెంచి ధర్మశాస్త్రాన్ని అనుష్ఠిస్తుంటాము."

ఏధర్మశాస్త్రంలోనూ నాకు మమత లేదని నేనన్నాను.

ఇంతలోనే బాబా మావద్దకు వచ్చాడు. ఉరికంబానికి తానే ఎక్కబోతున్నవానిమాదిరిగా మనిషి కనిపించాడు.

బయట చాలాజనం పోగైకనిపించారు. ఉభయ వర్గాల తాలూకూ బంధువులు వారని నాకు తెలిసివచ్చింది. హంతకుడి నెత్తురు కండ్లజూడవలెనని ఒక వర్గంవా రంటుంటే, పాపం, వా డేపాపమూ ఎరగడని ఇంకోవర్గంవా రంటున్నారు. ఇంతలో ఇద్దరు పోలీసు జవానులు ఒక యువతిని వెంటబెట్టుకొని మెట్లెక్కివచ్చారు. ఆ యువతి మాంచి ఒడ్డూ పొడుగూ, అందమూ చందమూ గల మనిషి అని చూచీ చూడగానే ఎవరికైనా ద్యోతకమవుతుంది.

విషయమంతా కరతలామలకంగా బోధపడింది' ప్రస్తుతహత్యకు కారణం ఎట్టఎదుట నాకు ద్యోతకమైంది.

"బలేబలే! ఎంతటి అందకత్తె!" అని బాబాతో చెవిలో అన్నాను.

"నే నెరుగుదునులే దాన్ని బాగా. దాని సంగతంతా నాకు ఎరుకే. అది ఇలా ఇదివరకే ఎంతమంది ప్రాణాలకు ఎసరుపెట్టిందో! జన్మతః అది ఒక పల్లెటూరిపిల్ల. ఒకానొక పెద్దమనిషి దాన్ని కెయిరోకు తీసుకొనివెళ్లి పెండ్లిచేసుకొన్నాడు. రెండు నెలలు తిరిగిందో లేదో విడాకులిచ్చి స్వస్థానానికి పంపించివేశాడు. ఆ రెండు నెలలలోనే మనిషి తీరే మారిపోయింది. ఆ రెండు నెలలలో కెయిరోలో అది తిరగని నాట్యస్థలం లేదు. దాంతో మనిషి పూర్తిగా మారిపోయింది. తత్ఫలితంగా స్వస్థానం చేరుకొన్నపిమ్మట అది ఒక విధమైన బహిరంగజీవితం గడిపింది. నాకు దాని సంగతి బాగా తెలుసు. ఏడాదికిందట, జబ్బుపడి నావద్ద చికిత్సకని వచ్చినప్పుడు స్త్రీల ఉద్ధరణను గురించి మహాజోరుగా మాట్లాడేది. పాపిష్ఠిపిల్ల! పాపిషి బతుకు!!"

అంటూ, "ఎందుకొచ్చినపీడ ఇది? వేగిరం వెళ్లిపోదాం రా" అని బలవంతాన నన్ను బండిదగ్గరకు లాక్కువెళ్లాడు.

బండిలో వెళ్లుతున్నాం. "దాని ఇటీవలి చర్యలు చెప్పుతాను విను" అంటూ మొదలుపెట్టాడు: "ఇప్పు డది అబ్దుల్ జస్సీములు పనిచేస్తూవచ్చిన హోటలులో చాకలిపిల్లగా పనిచేస్తున్నది. హోటలు పెరట్లోఉన్న తోటను అది తన అవినీతి సాహసచర్యలకు రంగస్థలం చేసుకొన్నది. అబ్దులే గనక చచ్చిపోయేటట్టయితే జస్సీను కాదు ఉరికంబమెక్కవలసింది: అది! కానయితే ఏం ప్రయోజనం? అసలు మనుష్యులుకాక తదితరులే ఈ ప్రపంచంలో బహుళంగా ఉరికంబాలపాలవుతూవుంటారు. అసలు నన్నడిగితే, ఉరికంబాల ప్రమేయమే అక్కరలేదంటాను. నేరానికి గల కారణాలేవో అవీ నిజానికి శిక్షాపాత్రాలు. జస్సీను కామోద్రిక్తుడై ఈ పని చేశాడు. ఇటువంటి చిత్తోద్రిక్తులను నేను అర్ధామాయకులనుగా పరిగణిస్తూ ఉంటాను."

"అయితే మనమంతా నిరభ్యంతరంగా హత్యలు సాగించవచ్చునన్న మాట."

"అలా కాదు. మనం విద్యావంతులం. మన చర్యల ఫలితాలను మనం ముందుగానే పసిపట్టగలం. జస్సీనువంటివారు అలా చేయలేరు. వారు వివేకమూ, పరిజ్ఞానమూ లేని పసికందలవంటివారు. అబ్దుల్‌ను చంపవలెనని వానికి ఏకోశానా లేదు. కాని చంపనేమో చంపినాడు."

"పాపిష్ఠి అసూయ!"

"అదిగో, అదే మీ యూరోపియన్లలో ఉండే దుర్గుణం! అన్నిటికీ ఏదో ఒకటి లేనిపోనిది ఆరోపిస్తుంటారు. ప్రతిదానికీ ఏదో ఒక చీటీ అంటిస్తుంటారు. ఇప్పుడే కదా నేను ఈ పని ఏదో ఉద్రేకంలో జరిగిందని చెప్పాను. అసూయ, దురాశ, కామం, క్రోధం, ద్వేషం ఇత్యాది అంతరార్థాలకు వెళ్లుతున్నావు నీవు! ఉద్రేకపదార్థంలో ఇవన్నీ ఇమిడిలేవూ? మాలాగానే మీ దేశంలోనూ వ్యక్తిహత్యలను శిక్షిస్తారు, నాకు తెలుసు. కాని సంఘహత్యలను మీ వారు సంతోషంతో ఆమోదిస్తారు. తలుగువిడిచిపెట్టిన అరిషడ్వర్గాల మూర్తీభావం కాకపోతే యుద్ధమంటే మరేదో చెప్పు. ఒక వ్యక్తిలో ఈ ఉద్రేకం కనబడితే అది శిక్షాపాత్రమూ, అదే మూకఉమ్మడిలో కనబడితే ఆమోదాస్పదమూనా?"

ఉన్నట్టుండి, మాటమధ్యలోనే బాబా కాస్త మౌనంలో పడ్డాడు. నేను దాన్ని భంగపుచ్చదలచ

లేదు. ఈ విషయాన్నే అతడు మనస్సులో మననచేసు కొంటూ మథనపడుతున్నట్టు కనిపించాడు.

ఇంతలో మా బంగళా వచ్చింది. "ఆస్పత్రికి వెళ్లి, పాపం, అబ్దుల్‌కు ఎలా ఉన్నదో చూడాలి. ఇక్కడ కూర్చుంటే తామసమౌతుంది" అంటూ బాబా వెళ్లి పొయ్యాడు.

బాబాది అదొక విచిత్రమైన ప్రకృతి. ఒక్కొక్కప్పుడు ఏవేవో తమాషా విషయాలు చెప్పుతూనే ఉంటాడు. ఏమీ ఎరగనివానివలె నీ వైపు రెప్ప వేయకుండా చూస్తాడు. నీవు నీ ప్రపంచంలోనే ఉంటావు గాని, అతడుమాత్రం అదేదో ప్రపంచంలో ఉండిపోయి, అందులోనుంచి మళ్లీ దృష్టిలేనట్టుగా ఉంటాడు. అవివాహితుడు. మనిషి కార్యభారంతో తలమునకలై పోతుంటాడు. మరీ అలిసిపోయినప్పుడు, ఎవరో ఒక స్నేహితుణ్ణి వెంటబెట్టుకొని ఇంటికివెళ్లి, ఆ స్నేహితుణ్ణి హాలులో కూర్చోబెట్టి "ఇదో ఇప్పుడే వస్తాను. పావుగంటలో. ఆ మాత్రం చాలు నా ప్రాణానికి. మిత్రులు కాచుకు కూర్చొన్నారనే ధ్యాస ఉంటే తామసం జరగకుండా ఉంటుంది" అని తన గదిలోకి వెళ్లి నిమిషంలో నిద్రాదేవతకు లొంగిపోయి విశ్రమిస్తూ ఉంటాడు. వృత్తిలో ఎప్పుడు ఏ పిలుపు వచ్చినా సమయాసమయాలు పాటించకుండా హాజరవుతుంటాడు. ఇంత శ్రమా ధనలోభానికీ కాదు, శాస్త్ర వ్యాసంగానికీ కాదు. ఆత్మలో రగులుతున్న అగ్ని ఆపని చేయిస్తున్నది.

ఆ కత్తిపోటువ్యవహారం ఏ స్థితిలో ఉన్నదో చూద్దామని మరునాటి మధ్యాహ్నం ఆస్పత్రికి వెళ్లాను.

"అబ్దుల్ అద్భుతంగానంటే అద్భుతంగా కోలుకొంటున్నాడు" అని బాబా నన్నాహ్వానించాడు. అతడింకా ప్రాణాలతో ఉన్నందుకు నాకు ఆశ్చర్యం వేసింది. "బలేగా కుట్టానులే గాయాన్ని! రేపు పథ్యం కూడా పుచ్చుకొంటాడు" అని నా ఆశ్చర్యాన్ని బాబా రెట్టించాడు.

ఇంతలో పబ్లిక్ ప్రాసిక్యూటరూ, మరొకాయనా అబ్దుల్‌ను పరీక్షించవలెనంటూ వచ్చారు. లోనికి వెళ్లి పరీక్షించారు. తిరిగిరావడంలో మహా విసుగుగా వచ్చాడు బాబా. వచ్చినవారు వెళ్లిపోయిన పిమ్మట విచారిస్తే ఇలా అన్నాడు: "నేనేమో నానా తంటాలుపడి ఇతని ప్రాణాన్ని కాపాడడానికి అఘోరిస్తూవుంటే వీరు మహాపని పొడుచుకుపోయినట్టు వచ్చి వీని ప్రాణాలు తీయజూస్తారు!"

"నీవంతుపని నీవు మనస్ఫూర్తిగా చేశావు. ఒక వేళ వాడుగనక చస్తే ఆతప్పు నీది కాదు."

"ఆఁ, వాడు చావడమా? ఎన్నటికీ చావడు!"

"ఏమమ్మా నీకంత అభిమానం. అచ్చంగా ఈ వ్యవహారమంతా నీకు సంబంధించినట్టుగానే మాట్లాడుతావే!"

బాబా తలుపు వేసివచ్చాడు. అక్కడ మేమిద్దరమే ఉన్నాం. నాదగ్గరగా వచ్చి ఇలా అన్నాడు: "అవును. ఇది అంతో ఇంతో నాకుకూడా సంబంధించినట్టే. అబ్దుల్‌కు భార్యా, అయిదుగురు బిడ్డలూ ఉన్నారు. జస్సీనుకూడా వివాహితుడే. ఇద్దరు బిడ్డలు కూడా. మావూరే వాడివూరూ. చిన్నప్పటినుంచీ వానిని నేను బాగా ఎరుగుదును. వాడితండ్రి మాతండ్రి వద్ద ముప్ఫయియేండ్లు నౌకరీచేశాడు. వాడీవూరు వచ్చినప్పుడు, వానిని జాగ్రత్తగా చూచుకోవలసిందంటూ మాతండ్రి నాకు జాబువ్రాశాడు. ఈ ఇద్దరూ ఆపిల్ల కోసం కొట్లాడుకుంటున్నట్టు నాకు తెలిసేగనక ఉంటే ఆ మాయలాడిని అప్పుడే ఇక్కడినుంచి తరిమించివేసి వుందును"

"ఇంతకూ, వృత్తిధర్మంగా మినహాయిస్తే దీనితో నీకేమి సంబంధమో నాకు బోధపడడంలేదు." అన్నాను.

"వృత్తి ధర్మమట వృత్తిధర్మం! ఏమిటి నీభావమన్నాను? మనిషి సదాసర్వకాలమూ వృత్తిధర్మంలో పడి ఉండవలసిందేనా, మానవమాత్రుడుగా మెలగవలసిన అవసరమే లేదా? మాటవరసకు అబ్దుల్ చస్తాడనుకో: జస్సీనును ఉరితీస్తారు. అవునా? దాంతో మరిరెండు సంసారాలు నిరాధారాలయి మాడిపోవటం లేదూ? ఈ కాటకబాధ దేశంనుంచి నామరూపాలు లేకుండా పోయేటంతవరకూ మనకు మోక్షం లేదు.

ఇప్పుడు తెలిసిందా, ఇది నా కెలా సంబంధించిందో? ఇద్దరి ప్రాణాలు నాచేతిలో ఉన్నాయి!"

ఆ తరువాత ప్రతిరోజూ నేను ఆస్పత్రికి వెళ్లి వస్తూనే ఉన్నాను. వెళ్లినప్పుడల్లా, బాబా, అబ్దుల్లా క్రమేణా స్వస్థత చెందుతూవున్నట్టే చెప్పుతూ వుండే వాడు. అబ్దుల్‌ను నేను స్వయంగా చూచినప్పుడు మాత్రం అతని ముఖవైఖరినిబట్టి అన్యథాగా గోచరించేది.

ఇలా పది రోజులుగడిచాయి. పదకొండో రోజు మధ్యాహ్నం బాబా మాయింటికి వచ్చాడు. ఆయన ముఖకవళికను చూస్తే పరిస్థితులు సానుకూలంగా లేనట్టనిపించింది.

"ఇప్పుడు నేనేమి చేయవలెనో తోచడం లేదోయ్. అబ్దుల్‌కు ఆగాయం మళ్లీ తిరగబెట్టింది. ఇంకొక ఆపరేషన్ చేయవలసిందిగా తోస్తున్నది. కాని, ఆపరేషనుకు తాళుకోగల జవసత్వాలు అతనిలో బొత్తిగా లేవు."

"నిన్నటివరకూ కూడా నీవు ఆశావహంగా చెప్పుతూవస్తివిగా?"

"అవును. అతనికి ప్రాణభయం లేదని అందరూ అనుకోవలెననే అలా చెప్పుతూ వచ్చాను. జస్సీను ఉరికంబమెక్కడం నా కిష్టం లేదు. అదే గనక తటస్థిస్తే ఏమవుతుందో నీకు తెలియదు. జస్సీన ప్రాణాలూ, అబ్దుల్ ప్రాణాలూకూడా కాపాడితీరమని మా తండ్రి నాకు వ్రాశాడు. జస్సీ నేగనక ఉరికంబమెక్కక తప్పక పోతే, ఆకించతో మా నాయన చచ్చిపోతాడు. జస్సీను మా యింటపుట్టి మా యింట పెరిగినవాడు. మేము అన్నదమ్ములవలె మెలిగినవారం. మా అన్న ఒకడు కెయిరోలో జడ్జిగాకూడా ఉన్నాడు. నేను గనుక వీనిని ఉరికంబమెక్కనిస్తే ఆయనేమనుకుంటాడు! ఏమయినాసరే, ఈ ఆపరేషన్ చేసి, నా శక్తివంచన లేకుండా పాటుపడకతప్పదు."

అంటూ ఆస్పత్రికి దారితీశాడు. నేనూ వెంట వెళ్లాను. ఆపరేషను సన్నాహాలు మొదలుపెట్టాడు. ఆ ఆయుధానికీ ఈ ఆయుధానికీ కేకలుపెట్టాడు. పెట్టె త్రీసి ఒక కత్తితీసి వేళ్లతో దానిపదును పరీక్షించి, దీపపు వెలుగులో దాన్ని పట్టుకొనిచూచి "తుప్పుపట్టిం"దంటూ, కడిగి శుభ్రం చేయవలసిన వాటితో దాన్నీ కలిపాడు. ఆపరేషనుకు సిద్ధమవుతున్నాడు. అబ్దుల్ ముఖం చూచాను. మృత్యుచ్ఛాయలు అప్పుడప్పుడే కమ్ముతున్నట్లు తోచింది. నేను బయటికి వెళ్లిపోయినాను.

మరికొన్ని నిమిషాలకు బాబా బయటికి వచ్చాడు. ముఖం పాలిపోయి ఉన్నది. చేతులూ, కాళ్లూ వణుకుతున్నాయి. "పని పూర్తయిపోయిం"దని సగద్గదంగా, అని కుర్చీలో కూలబడ్డాడు.

"చనిపోయాడా, ఏం?" అన్నాను.

"లేదు, చనిపోలేదు" అని అదోరకమైన గుంభనగా అన్నాడు. నా వైపు భారదృష్టులు సారించాడు. అంతలోనే అహమ్మద్ గదిలోకి తొంగిచూశాడు. ఏమో చెప్పాడు. బాబా లేచి బయటికి వెళ్లాడు. మళ్లీ పదినిమిషాల్లో తిరిగివచ్చాడు. "పాపం, దౌర్భాగ్యుడు, చచ్చిపోయాడు" అంటూ కళ్లనీళ్లు పెట్టుకొన్నాడు. "రా, పోదా"మన్నాడు.

మా బంగళాకు వెళ్లాము. అక్కడ బాబా నేను అదివరకూ ఎన్నడూ కని విని యెరగనంతగా విస్కీ పోసుకొన్నాడు.

ఆ తర్వాత కొద్దిరోజులు నేను గ్రామాంతరం వెళ్లవలసివచ్చింది. ఇక్కడి వ్యవహారాలు బొత్తిగా నాకు దూరమైపోయినాయి. తిరిగి వచ్చిన తర్వాత ఒకనాడు డాక్టరు సులేమాన్ నా దగ్గరికివచ్చి "నీకు తెలుసా? మన బాబా స్వగ్రామం వెళ్లిపోయాడు. ఉద్యోగం మానుకొన్నాడు" అని చెప్పాడు.

"ఏమి జరిగిందేమిటి?" అన్నాను విచారంగా.

"అబ్దుల్ నెరుగవూ? వాడు చస్తాడని నేను అప్పుడే చెప్పాను జ్ఞాపకమున్నదా? వాడు నిజంగా దేనిమూలాన చచ్చాడో ఇదమిత్థంగా ఇప్పటికీ ఎవ్వరూ చెప్పలేకున్నారు. హత్యానేరానికై జస్సీనుమీద ప్రాసిక్యూషను జరుపుతుండగా న్యాయశాఖామాత్యుడు కేసు ఆపివేయించాడు. ఆరోగ్యశాఖామాత్యుడు బాబాను ఉద్యోగంనుండి తొలగించి మరొకతన్ని ఆపనికి నియ

మించాడు. అబ్దుల్ నిజానికి కత్తిపోటు గాయాలవల్ల చావలేదనీ, అంతటిగాయం అసలు తగలనే లేదనీ, ఆపరేషన్ సమయంలో దైవికంగా కలిగిన ఒక పొరబాటువల్ల ఆ మరణం సంభవించిందనీ బాబా "దేవుని సాక్షిగా" ప్రమాణంచేసి ఒక ప్రకటనచేసినట్టు చెప్పుకొంటారు....అదేంపాడోగాని, ఇప్పుడు ఆవ్యవహారమంతా న్యాయశాఖామాత్యుని చేతులో ఉన్నది. అంతా అయోమయంగా ఉన్నది."

ఇదేదో న్యాయశాస్త్రంయొక్క, శిక్షాస్మృతియొక్క అంతుపట్టడానికే వచ్చిపడ్డట్టు నామనస్సుకు తోచింది.

*          *          *          *

రెండేండ్లతరువాత నేను పనిమీద కెయిరోవెళ్లి ఉండి, ఒకనాడు ఎక్కడో తిరుగుతుండగా వెనుకనుంచి ఎవరో నన్ను పేరుపెట్టి పిలిచారు. అందులో ఎంతో ఆప్యాయతా, ఆనందమూ పొడగట్టాయి. తిరిగి చూస్తునుగదా—బాబా! నన్ను అమాంతం కావలించుకొని, పక్కనే ఉన్న కాఫీ-టీ-రొట్టె-మిఠాయి వగైరాల షాపుకు లాక్కొనివెళ్లాడు. చిరకాలానికి మళ్లీ కలుసుకోగలిగినందుకు తన ఆనందాన్ని వెల్లడించాడు.

"అయితే ఇప్పుడేమి చేస్తున్నావు నీవు?" అన్నాను.

"ఒకప్పుడు డాక్టరుగా ఉన్నవాడు ఎల్లప్పుడూ డాక్టరే"నన్నాడు.

"కాని, బడాహకీమువి మాత్రం కావుగా?" అన్నాను.

"ఏం, బడాహకీమునే" అన్నాడు.

"Leucorrhoea Cure"
అద్భుత
"కుసుమరోగనివారిణి"
స్త్రీలకు తరుచుగా సంభవించెడి ప్రదర రోగములకు అనగా తెలుపు, ఎరుపు మొదలగు అన్ని కుసుమవ్యాధులకు 10 సంవత్సరముల అనుభవముచే కనుగొనబడిన ఆయుర్వేదచికిత్స. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము కనుగొనబడినది.
90 మాత్రల డబ్బీ రు 2-8-0.
ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము
ఆయుర్వేదవైద్యనిలయం,
P. O. ఎలకుర్రు కృష్ణాజిల్లా.
ప్రతిపట్టణములోను స్టాకిస్టులు కావలెను.

"అదెల్లాగు?"అని నేను ఆశ్చర్యం వెలిబుచ్చాను.

"కొత్తమంత్రులు వచ్చారు"అన్నాడు.

నామనోగతభావాలను, ఎట్టఎదుటి పుస్తకంలోలాగ, ఆకళింపుచేసుకొని "జస్టిస్ సంగతి ఏమయిందో తెలుసా? రెండేండ్లశిక్షతో పీడవదిలింది" అన్నాడు

"చేత కత్తిపట్టేసరికి అంత పనికిమాలిన వాడవైపోయినావు కాబట్టి! బాబా, నాబాబా, ఎంత చండప్రచండుడవోయి నీవు!"

అంటూ అతనివీపు నిమిరాను.

